క్లుప్తంగా

వరసిద్ధునికి విరాళం



విరాళం అందిస్తున్న కుటుంబ సభ్యులు

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో వసతి సముదాయ నిర్మాణానికి బుధవారం ఓ దాత కుటుంబం నగదు విరాళం అందించింది. తూర్పుగోదావరి జిల్లా కోరుకొండకు చెందిన వెంకటలక్ష్మి, నరసింహస్వామి కుటుంబ సభ్యులు వసతి నిర్మాణానికి రూ.6.50 లక్షలు చెక్కురూపంలో విరాళంగా ఇచ్చారు. ఈ నగదును అందుకున్న సిబ్బంది వారికి ప్రత్యేక దర్శనం కల్పించారు. ప్రసాదం అందజేశారు.

పులిహోర ప్యాకింగ్ మిషన్ ప్రారంభోత్సవం



ప్యాకింగ్ మిషన్‌ను ప్రారంభిస్తున్న ఈవో

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని బూందీ పోటులో బుధవారం ఆధునిక నూతన పులిహోర ప్యాకింగ్ మిషన్ ప్రారంభించారు. భక్తులకు పులిహోర విక్రయించేందుకు ఈ మిషన్‌ను పూజ చేసి ప్రారంభోత్సవం చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ప్రసాదం అందించడంలో భాగంగా ఈ మిషన్‌ను ప్రారంభించామని ఈవో పెంచల కిషోర్ తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



విద్యార్థులకు పుస్తకపఠనంపై శిక్షణ ఇస్తున్న గ్రంథాలయాధికారి సుజాత

ఐరాల: విద్యార్థులు విజ్ఞానం కోసం పుస్తకాలను చదవాలని స్థానిక గ్రంథాలయాధికారి సుజాత పేర్కొన్నారు. గ్రంథాలయంలో బుధవారం ఉచిత వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. విద్యార్థులతో పుస్తక పఠనం, కథలు రాయించడం, సైన్స్ క్విజ్ పోటీలు, ఆంగ్లంలో మాట్లాడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. విరామ సమయంలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచడం, విద్యావంతులుగా తీర్చిదిద్దడం, వారి ఉజ్వల భవితకు బాటలు వేయడం ఈ కార్యక్రమం ఉద్దేమన్నారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఇంటి వద్దే మెరుగైన వైద్యం



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రక్షిత

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని బొమ్మసముద్రం డాక్టర్ రక్షిత అన్నారు. మండలంలోని చింతగుంటూరు గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ఇంటివద్ద మంచాన పడ్డ రోగుల వద్దకు వెళ్లి వారికి కావాల్సిన వైద్యసేవలను అందజేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించి పౌష్టికాహారం తీసుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శ్రీలక్ష్మి, వనజ, కలైవాణి, కోకిల, సుజాత పాల్గొన్నారు.

ఖాతాదారుల సేవే లక్ష్యం



నూతన ఏటీఎం కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం, బ్యాంకు మేనేజర్

ఐరాల: ఖాతాదారులతో పాటు రైతులు, వ్యాపారులకు సేవలందించే లక్ష్యంతో తమ బ్యాంకు ముందుకు సాగుతోందని యూకో బ్యాంకు మేనేజర్ భానుచందర్ పేర్కొన్నారు. స్థానిక యూకో బ్యాంకులో బుధవారం ఏటీఎం కేంద్రాన్ని ఆయన ఆధ్వర్యంలో ఏపీఎం నాగరత్న ప్రారంభించారు. బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ఖాతాదారులకు సైతం సేవలందించేందుకు వీలుగా తమ బ్యాంకు ఆధ్వర్యంలో నూతనంగా ఏటీఎం కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. ఏటీఎం కేంద్రంలో డిపాజిట్ల సౌకర్యం కూడా ఉందన్నారు. దీంతో ఖాతాదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. తమ బ్యాంకు అందిస్తున్న సేవలను ప్రజలు, రైతులు, వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

తీయని విషం

- పండ్లను కృత్రిమంగా మగ్గపెడుతున్న వ్యాపారులు
- ఇష్టానుసారంగా విక్రయాలు
- ప్రజల ఆరోగ్యంపై ప్రభావం
- హెచ్చరిస్తున్న వైద్యనిపుణులు



విక్రయానికి ఉంచిన మామిడిపండ్లు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఈ ఏడాది మామిడి పంట జిల్లాలో దాదాపు దెబ్బతింది. వాతావరణ ప్రతికూల పరిస్థితుల కారణంగా పూత మాడిపోయింది. దీనిని వ్యాపారస్తులు ఆసరాగా చేసుకొని వినియోగదారుల జేబుకు చిల్లులు పెడుతున్నారు. గతంతో పోల్చుకుంటే మామిడి దిగుబడి తగ్గడంతో ధర పెరిగింది. ఇటీవల వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా అకాల వర్షాలు, గాలులకు నేలరాలిన మామిడి కాయలను సేకరించి వాటిపై ప్రమాదకర క్యాల్షియం కార్బైడ్‌ను ఉపయోగించి త్వరితగతిన పక్వానికి తీసుకొస్తున్నారు. ఆరోగ్యానికి హాని కలిగించే ఈ తరహా రసాయనాలను వినియోగించకూడదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గ వ్యాప్తంగా మామిడి పండ్ల అమ్మకాలు జోరందుకుంటున్నాయి. పండ్ల మార్కెట్లతో పాటు రోడ్డుకు ఇరువైపులా అక్కడక్కడ ఈ మామిడి పండ్లు మిలమిల మెరిసిపోతున్నాయి. అయితే ఇందులో ఏదీ మేలురకం, ఏదీ హాని రకం అనే విషయాన్ని ప్రజలు గుర్తించకపోతే వ్యాధుల బారిన పడే ప్రమాదముంది.

మేలైన పండు ఏదంటే..

ప్రస్తుత సీజన్‌లో మామిడి కాయలు పక్వానికి వచ్చినప్పుడు ప్రకృతి సిద్ధంగా వాటి నుంచి ఉత్పత్తి అయ్యే ఇథిలియన్ కారణంగా పండి మంచి రంగును స్వయంగా చేకూర్చుకుంటాయి. తద్వారా వచ్చిన రుచి, పోషకాలు ఆరోగ్యానికి ఉపయోగపడతాయి. ఈ తరహా పద్ధతులకు స్వస్తి చెప్పి రసాయనాలను వాడడం ద్వారా పక్వానికి వచ్చే పండ్లను తినడం శ్రేయస్కరం కాదు. తప్పనిసరి పరిస్థితుల్లో ఇథిలియన్ వాయువు 100 పీపీఎంలు మాత్రమే వినియోగించాల్సి ఉంటుంది. ఈ వాయువును 24 గంటలు తగిలేటట్టుగా ఐదు రోజులు కాయలను ఉంచితే సహజత్వానికి దగ్గరగా ఎటువంటి హాని లేకుండా పక్వానికి వస్తాయి. మామిడి కాయల కోత అనంతరం వంద లీటర్ల నీటికి 13 ఎంఎల్ ఎత్రిల్ కలిపి అందులో ముంచి ఆరబెడితే సహజత్వానికి దగ్గరగా పండుతాయి. మరింత సురక్షితంగా పండించాలంటే ఇళ్లల్లో వరిగడ్డి వేసి కాయలను నిల్వ ఉంచడం ద్వారా పండించవచ్చు. రంగు చూసి మోసపోవడం, సీజన్‌కు ముందు వచ్చే పండ్లను తినడం ఆరోగ్యకరం కాదు. బహిరంగ మార్కెట్లో పండ్లను కొని తినేముందు ఉప్పు నీటిలో 20 నిమిషాలు ఉంచి తిరిగి మంచి నీటితో శుభ్రంగా కడిగి అనంతరం తొక్కతీసి తినడం మంచిది.

తేడాలు గుర్తిస్తే మేలు

సహజంగా పండే మామిడి కొంత పసుపు, మరికొంత ముదురు ఆకుపచ్చ రంగులో ఉండి లోపలి భాగం పరిపక్వంగా ఉంటుంది. కృత్రిమంగా పండే పండ్లు మొత్తం ఒకే విధమైన రంగును కలిగి ఉంటాయి. పైకి పండినట్టు కనిపించినా లోపల రుచిలో తేడా ఉండి చప్పగా, పుల్లగా ఉంటాయి. సహజంగా పండే పండ్ల నుంచి వచ్చే వాసన ఇట్టే గుర్తించవచ్చు. కృత్రిమంగా పండించిన పండ్ల నుంచి వాసన ఏమాత్రం రాదు.

అనారోగ్య సమస్యలు



రసాయనాలను ఉపయోగించిన పండ్లు తినడం వలన ఆరోగ్యానికి హాని, దీని వలన కడుపులో అల్సర్, క్యాన్సర్‌తో పాటు కాలేయం, మూత్రపిండాల వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. వినియోగదారులు శ్రేష్టమైన, సహజసిద్ధంగా పండే మామిడి పండ్లను తినాలి. నిషేధిత పదార్థాలను వాడి మామిడిని పండించి బహిరంగ మార్కెట్లో విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలి.

–వెంకటప్రసాద్, వైద్యనిపుణులు, చిత్తూరు

నేటి నుంచి వేసవి క్రీడా శిక్షణ తరగతులు

బంగారుపాళెం: మండల కేంద్రంలో గురువారం నుంచి వేసవి క్రీడా శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు డీఎస్‌డీఓ బాలాజీ తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ క్రీడల్లో ఉదయం సాయంత్రం ఉచిత శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భగవద్గీతపై ప్రచారం



కార్యక్రమంలో సమితి సభ్యులు

పూతలపట్టు (కాణిపాకం): పూతలపట్టు మండలంలో బుధవారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. మండలంలోని వెంగనపల్లి, జెట్టిపల్లి, నుచుపల్లి, చిన్న బండపల్లి, పెద్ద బండపల్లి గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక గ్రంథాలపై ప్రచారం చేశారు. కార్యక్రమంలో బంగారుపాళ్యం, కుప్పం కమిటీ సభ్యులు సుధకార్, మాధవరెడ్డి, రత్నం, నాగమ్మ, మహేందర్‌రెడ్డి, రమణారెడ్డి, వెంకట సుబ్బమ్మ, పూర్ణిమ, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధన కోసం పాటుపడదాం





అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు, చిత్ర పటాన్ని ఊరేగిస్తున్న యువకులు

బంగారుపాళెం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం సమష్టిగా పాటుపడదామని రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు చెన్నకేశవులు అన్నారు. మండలంలోని మహాసముద్రం దళితవాడలో బుధవారం విశ్రాంత ఆరోగ్య అధికారి కృష్ణన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ 134వ జయంతిని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి దళితనాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ట్రాక్టర్‌పై అంబేడ్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి ఊరేగించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో చెన్నకేశవులు మాట్లాడుతూ, అంబేడ్కర్ ఆశయాల సాధనకు అందరూ కలసికట్టుగా కృషి చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా అంబేడ్కర్ చేసిన కృషి ఎనలేనిదన్నారు. రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘం అధ్యక్షులు అశోక్‌బాబు మాట్లాడుతూ, సమాజంలో దళితజాతి ఎదుగుదలకు విద్యే ఆయుధమని చాటి చెప్పిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. జిల్లా ఎన్‌జీఓ సంఘం అధ్యక్షులు రాఘవులు, సీనియర్ దళిత నాయకులు జయరామ్, ఏపీ మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షులు దేవానంద్, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో చిత్తూరు నియోజకవర్గ బీఎస్పీ అధ్యక్షులు ఉదయకుమార్, వివిధ దళిత సంఘ నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధునికి భక్తిశ్రద్ధలతో తిరుప్పావడ సేవ



కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామి అనుబంధ ఆలయమైనా శ్రీదేవి భూదేవి సమేత వరదరాజుల స్వామి ఆలయంలో బుధవారం తిరుప్పావడ సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అక్షర తృతీయ సందర్బంగా ఈ సేవ నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేక పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో వరసిద్ధి వినాయక స్వామి ఏఈఓ రవీంద్రబాబు, సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఉభయకర్తలు పాల్గొన్నారు.

సప్తకనికలమ్మ సేవలో పెద్దిరెడ్డి



అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం దొడ్డిపల్లిలోని వెలసిన శ్రీ సప్తకనికలమ్మను బుధవారం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అర్చన చేశారు. కర్పూర హారతులు పట్టి దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. వివాహానికి హాజరు కాక ముందు అమ్మవారిని ఆయన దర్శించుకున్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు జ్ఞాన జగదీష్ తదితరులున్నారు.

ముగిసిన గంగ జాతర

కార్వేటినగరం : మండల పరిధిలోని రాజుల కండ్రిగలో రెండు రోజుల పాటు నిర్వహించిన గంగమ్మ జాతర బుధవారం వైభవంగా ముగిసింది. మంగళవారం సాయంత్రం నడివీధి గంగమ్మ ఆలయ ఆవరణలో మహిళలు అమ్మవారికి అంబళ్లు పోశారు. అనంతరం పొంగళ్లు వండి పిండి దీపాలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి అమ్మవారిని సుందరంగా అలంకరించి గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం వేకువ జామున ఆలయానికి చేరుకున్న అమ్మవారికి భక్తులు జంతు బలులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ క్రమంలో యువత అఘోరా వేషధారణతో గ్రామ వీధుల్లో ఊరేగుతూ ఆకట్టుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఘనంగా ముగిసిన కుంభాభిషేకం



కొలువుదీరిన గంగమ్మ

గుడిపాల: మండలంలోని ముత్తువాళ్లూరులో ఉండే గంగమ్మ ఆలయ కుంభాభిషేకం బుధవారం ఘనంగా నిర్వహించారు. గంగమ్మ విగ్రహావిష్కరణతో పాటు విఘ్నేశ్వరపూజ, సూర్యపూజ, ద్వారపూజ, పంచగవ్యము, మహా పురాణహుతి, మహాభిషేకం, మహా దీపారాధన నిర్వహించారు. వేదపండితులు హోమం నిర్వహించారు. కుంభ కలశమును ప్రదక్షిణం చేశారు. వచ్చిన భక్తులందరికీ అన్నదానం చేశారు.



కుంభాభిషేకంలో పాల్గొన్న గ్రామస్తులు

అక్షయ తృతీయ కొనుగోళ్లు అంతంతే..!



నగరంలో వెలవెలబోతున్న నగల దుకాణం

చిత్తూరు అర్బన్: అక్షత తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకుని బంగారం కొనాలనే సెంటిమెంట్ ఈ సారి జిల్లాలో బులియన్ మార్కెట్‌పై పెద్దగా అనుకూల ప్రభావం చూపలేదు. కొనుగోలుదారులులేక చాలా చోట్ల బంగారు ఆభరణ దుకాణాలు వెలవెలబోయాయి. అక్షయ తృతీయ పండుగను పురస్కరించుకుని బుధవారం చిత్తూరు నగరం లాంటి ప్రధాన కేంద్రంలో దాదాపు 90 శాతం దుకాణాలు ఖాళీగా దర్శనమిచ్చాయి. మామూలు రోజుల్లో జరిగే వ్యాపారం కూడా అక్షయ తృతీయ రోజున జరగలేదని వ్యాపారులు నిట్టూరుస్తున్నారు. ఇక పలమనేరు, పుంగనూరు లాంటి చిన్న పట్టణాల్లో అక్షయ తృతీయ వ్యాపారంపై మాట్లాడాల్సిన అవసరమే లేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరిలో పసిడి వ్యాపారం పెద్దగా జరగకున్నా.. స్థానికులు తమిళనాడులోని పళ్లిపట్టులో పుత్తడి కొనడానికి ఆసక్తి చూపించడంతో, తమిళనాట తెలుగువారి వ్యాపారం బాగానే జరిగినట్టు తెలుస్తోంది. మొత్తంగా జిల్లా వ్యాప్తంగా రోజుకు సగటున రూ.10 కోట్లకు పైగా జరిగే బులియన్ వ్యాపారం.. అక్షయ తృతీయ నాడు పూర్తిగా పడిపోయింది. గతేడాది చిత్తూరులో 24 క్యారెట్ల గ్రాము బంగారం రూ.7,300 ఉంటే.. ప్రస్తుతం రూ.9,900 వరకు ఉండడమే దీనికి ప్రధాన కారణం. దీంతో బంగారం కొనాలనే వాళ్లు కూడా అమాంతంగా పెరిగిన ధరలతో మిన్నకుండిపోయారు.

మామిడి కొనుగోలుకు దుకాణాలు సిద్ధం



చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మార్కెట్ యార్డులో మామిడికాయల కొనుగోలుకు వ్యాపారులు సిద్ధం అవుతున్నారు. బుధవారం మంచి ముహూర్తం కావడంతో నాలుగు షాపులకు పూజలు చేసి, ప్రారంభించారు. ఈనెల 15వ తేదీ తరువాత కత్తెర ఉందని ముందస్తుగానే మంచి ముహూర్తం చూసి మామిడి కొనుగోలుకు పూజలు చేశారు.

మహాభారత యజ్ఞం ప్రారంభం



ధ్వజారోహణంలో నిర్వాహకులు

గుడిపాల: మండలంలోని వసంతాపురం గ్రామంలో బుధవారం మహాభారత యజ్ఞం ఘనంగా ప్రారంభించారు. ఉదయం ద్రౌపది, ధర్మరాజుల ఆలయం వద్ద మహిళలు పొంగళ్లు పెట్టి వేదపండితుల మధ్య ఘనంగా పూజలు చేశారు. అనంతరం మాజీ జెడ్పీటీసీ బాలాజీనాయుడు గారిచే ధ్వజారోహణం నిర్వహించారు. ధర్మరాజుల గుడివద్ద నుంచి ద్రౌపది, భీమ, అర్జున, నకుల, సహదేవ, అభిమన్యుడు, సుభద్ర, శ్రీకృష్ణుడు విగ్రహాలను మహాభారత యజ్ఞం వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. మధ్యాహ్నం 2గంటలకు హరికథా భాగవతార్ వినయ్‌ప్రసాద్‌రెడ్డి హరికథాగానం చేశారు. వసంతాపురంలో రాత్రి బాణసంచా వేడుకల మధ్య విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించారు.



ఉత్సవమూర్తుల ఊరేగింపు

అంగన్‌వాడీలకు వేసవి సెలవులు లేవా?

- ఉక్కపోతకు అల్లాడుతున్న పిల్లలు
- సెలవులు ఊసే ఎత్తని ప్రభుత్వం
- తగ్గుతున్న హాజరు శాతం
- ఇబ్బందులు పడుతున్న చిన్నారులు



అంగన్‌వాడీలో అన్నప్రాసనం చేస్తున్న దృశ్యం



పిల్లలకు పాఠాలు నేర్పుతున్న అంగన్‌వాడీలు

గుడిపాల: ఎండలు దంచికొడుతున్నాయి. పెద్దలు, పిల్లలు ఎండలకు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. పాఠశాలలకు, కళాశాలలకు వేసవి సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. కానీ చిన్న పిల్లలు ఉండే అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రం సెలవులు ఇవ్వకపోవడంతో చిన్నారుల తల్లిదండ్రులు కేంద్రాలకు పిల్లలను పంపడం లేదు. ఫలితంగా హాజరు శాతం తగ్గిపోయింది. పెద్ద పిల్లలకు సెలవులు ఇస్తున్న ప్రభుత్వం చిన్న పిల్లల విషయంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందో అర్థం కావడం లేదంటూ చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని ఐసీడీఎస్ పరిధిలో 50 అంగన్‌వాడీ కేంద్రాలు, 20 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో పిల్లలు దాదాపు 700మందికి పైగా విద్యను అభ్యసిస్తున్నారు. కిశోర బాలికలు 1500 మంది ఉన్నారు. వేసవి సెలవుల్లో అన్ని విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించిన ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలు మాత్రం మండు వేసవిలో కేంద్రాలకు రావాల్సిన దుస్థితి నెలకొంది. మే 1 నుంచి అంగన్‌వాడీ టీచర్లకు నెలలో 15 రోజులు, మరో 15 రోజులు సహాయకులకు సెలవులు మంజూరు చేశారు. ఒకే కార్యకర్త ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో నెల రోజులు ఒకరే పనిచేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఆరేళ్ల లోపు పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తారు. వీరికి వేసవి సెలవులు ఇవ్వకపోవడంతో హాజరుశాతం తగ్గిందని అంగన్‌వాడీ కార్యకర్తలు వాపోతున్నారు.

అల్లాడుతున్న పిల్లలు

ఉదయం 7 గంటల నుంచే ఎండలు మండిపోతున్నాయి. చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫ్యాన్లు ఉన్నప్పటికీ ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. మధ్యలో విద్యుత్ సరఫరా పోతే వారి పరిస్థితి గందరగోళంగా ఉంటుంది. దీంతో తల్లిదండ్రులు పిల్లలను పంపించకుండా ఇంటివద్దనే ఉంచుకుంటున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా అన్ని పాఠశాలలతో పాటు సెలవులు ఇవ్వాలని అంగన్‌వాడీ కార్యకర్తలు, పిల్లల తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఘనంగా కుంభాభిషేక పూజలు

పాలసముద్రం : మండలంలోని క్రిష్ణజమ్మపురం గ్రామంలో వెలసిన ద్రౌపతి అమ్మవారి ఆలయ ముఖ ద్వార మహాకుంభాభిషేకం బుధవారం వైభవంగా జరిగింది. వేదపండితులు వివిధ యాగశాల పూజలు నిర్వహించారు. అనంతరం కోలాట కార్యక్రమం చేపట్టారు.